# సాక్షి అనంతపురం

గురువారం । 19 । సెప్టెంబర్ । 2024






## చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి



## మెగా సప్లి గడువు పొడిగింపు

ఎస్కేయూ యూజీ మెగా సప్లిమెంటరీ దరఖాస్తు గడువు పొడిగించారు. అపరాధ రుసుము లేకుండా ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

గరిష్టం/కనిష్టం

35.9°/22.5°

జిల్లా అంతటా బుధవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికం గా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

## న్యూస్‌రీల్

### డ్వామా ఇన్‌చార్జ్ పీడీగా విజయలక్ష్మి



పీడీగా బాధ్యతలు చేపట్టిన విజయలక్ష్మి

అనంతపురం టౌన్: జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఇన్‌చార్జ్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పి.విజయలక్ష్మిని నియమిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులను జారీ చేశారు. ఇక్కడ పీడీగా పని చేస్తున్న వేణుగోపాల్‌రెడ్డిని మాతృశాఖకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయడంతో డ్వామా కార్యాలయంలో ఏఓగా పని చేస్తున్న విజయలక్ష్మికి ఇన్‌చార్జ్ పీడీగా అదనపు బాధ్యతలను ఇచ్చారు. విజయలక్ష్మి గతంలో మెప్మా, ఐసీడీఎస్ పీడీగా పని చేశారు. బుధవారం డ్వామా కార్యాలయంలో పీడీగా ఆమె బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఉద్యోగులు పుష్పగుచ్ఛాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

### ఐటీఐల్లో నాల్గో విడత ప్రవేశాలకు దరఖాస్తు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను నాల్గో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొలి మూడు విడతల అడ్మిషన్లలో మిగిలిపోయిన సీట్లను నాల్గో విడతలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26లోగా iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సమీపంలోని ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐల ప్రవేశాలకు 28న, ప్రైవేట్ ఐటీఐల ప్రవేశాలకు 30న కౌన్సెలింగ్ ఉంటుందని వెల్లడించారు.

### రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా విజయలక్ష్మీ

అనంతపురం టౌన్: ఉమ్మడి అనంతపురం జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీగా విజయలక్ష్మీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ చీఫ్ సెక్రటరీ సిసోడియా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అనంతపురం డీఐజీగా పని చేస్తున్న ఎం. మాధవిని ఏలూరు జిల్లా డీఐజీగా బదిలీ చేశారు.

**డీఆర్‌గా భార్గవ్ కొనసాగింపు..**

జిల్లా రిజిస్ట్రార్‌గా జీ. భార్గవ్‌ను అలాగే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ట్రైనీ డీఆర్‌గా జిల్లాకు వచ్చిన భార్గవ్‌ను 8 నెలల క్రితం ఇన్‌చార్జ్‌గా నియమించారు. ఈ క్రమంలోనే అదేస్థానంలో కొనసాగిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు.

**శ్రీ సత్యసాయి జిల్లా డీఆర్ బదిలీ..**

శ్రీ సత్యసాయి జిల్లా రిజిస్ట్రార్ క్రిష్ణకుమారిని శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. అయితే శ్రీ సత్యసాయి జిల్లాకు కొత్త డీఆర్‌ను నియమించలేదు. అనంతపురం ఆడిట్ విభాగం డీఆర్‌గా బి.శ్రీనివాసులను నియమించారు.

### రేపు జాబ్‌మేళా




అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక బాలుర ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఐటీఐ ప్రిన్సిపాల్ రామమూర్తి, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆనంద్ రాజ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇన్నోసోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, రిలయన్స్ నిప్పన్ లైఫ్ ఇన్సూరెన్స్, కోజెంట్ ఈ–సర్వీసు, సీఎస్‌ఆర్ అసోసియేట్స్, హుస్‌దై మొబీస్ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని ఆయా కంపెనీలకు అవసరమైన మానవ వనరులను ఎంపిక చేయనున్నారు. ఎస్‌ఎస్‌సీ, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ చదివిన వారు అర్హులు. ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు వెంట తీసుకెళ్లాలి. మరిన్ని వివరాలకు 79954 82414లో సంప్రదించవచ్చు.

### నేడు ఎంఎస్‌ఎంఈ సదస్సు

అనంతపురం టౌన్: ఎంఎస్‌ఎంఈల ప్రగతి, ఉత్పత్తుల ఎగుమతులపై అవగాహన కల్పించేందుకు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు రాయదుర్గంలోని రెడీమేడ్ గార్మెంట్స్ యజమానుల సంక్షేమ సంఘం భవనంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజారావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర పరిశ్రమల మంత్రిత్వ శాఖ, వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఈ సదస్సును ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు పక్కాగా అమలు చేస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు ఊరూ.. వాడా ఊదరగొట్టారు. అన్నదాతా సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేస్తాం.. ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ. 15 వేలు తల్లికి వందనం పేరిట ఇస్తాం... ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు అందజేస్తాం.. నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తాం.. ప్రతి మహిళకు నెలకు రూ.1,500 చొప్పున ఖాతాలకు జమచేస్తాం.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని మేనిఫెస్టోలో చేర్చి భారీగా ప్రచారం చేశారు. తీరా అధికారంలోకి వచ్చాక హామీలను గాలికి వదిలేశారు. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి రేపటితో వంద రోజులవుతున్నా ఒక్క పథకం గురించీ ఇంత వరకూ అతీగతీ లేదు. మరోవైపు గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చెప్పినవి చెప్పినట్లుగా పథకాలన్నీ పక్కాగా అమలు చేసింది. దీంతో ప్రజలు గత ప్రభుత్వంలాగే హామీలన్నీ కచ్చితంగా నెరవేర్చాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.



# బాబు ష్యూరిటీ.. బాబు సూపర్ 6 మోసం గ్యారంటీ

- ఎన్నికల వేళ సూపర్‌సిక్స్ పథకాలంటూ చంద్రబాబు ఢంకా
- అధికార పగ్గాలు చేపట్టాక హామీలు గాలికి
- బడులు తెరిచి మూడు నెలలు దాటినా 'తల్లికి వందనం' ఊసే లేదు
- ఖరీఫ్ ముగుస్తున్నా ఒక్క రైతుకూ దక్కని రూ.20 వేల సాయం
- ఎండమావిగా మారిన నిరుద్యోగులకు రూ.3 వేల భృతి
- ప్రతి మహిళకూ రూ.1,500 పథకానికి పంగనామాలు
- ఉచిత బస్సు ప్రయాణంపైనా నోరెత్తని వైనం
- ఓట్లేసి చంద్రబాబు వంచనకు గురయ్యామని అన్ని వర్గాల్లో ఆందోళన

**గత ఐదేళ్లలో జిల్లాలో రైతు భరోసా అమలు ఇలా..**



| సంవత్సరం | రైతుల సంఖ్య | సాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2019-20 | 2,87,726 | 384.39 |
| 2020-21 | 2,98,535 | 402.63 |
| 2021-22 | 2,77,051 | 381.95 |
| 2022-23 | 2,76,336 | 372. 82 |
| 2023-24 | 2,94,234 | 337.50 |

**జగన్ హయాంలో జిల్లాలో అమ్మఒడి అమలు ఇలా..**



| సంవత్సరం | తల్లుల సంఖ్య | సాయం (రూ.కోట్లలో) |
|---|---|---|
| 2020 | 3,62,579 | 543.90 |
| 2021 | 3,81,559 | 572.34 |
| 2022 | 2,16,842 | 325.25 |
| 2023 | 2,13,394 | 277.40 |

సాక్షిప్రతినిధి, అనంతపురం: ఇటీవల ఎన్నికల వేళ సూపర్‌సిక్స్ పథకాలంటూ ఊరూరా ప్రచారం నిర్వహించిన చంద్రబాబు అధికారంలోకి రాగానే వాటి ఊసే ఎత్తడం లేదు. 2014లోనూ 'పూర్తి రుణమాఫీ చేస్తా, బ్యాంకుల్లో ఉంచిన బంగారుకు పైసా కట్టొద్దు, లోన్లు చెల్లించవద్దు' అంటూ ఆశ పెట్టి గద్దెనెక్కాక వంచించిన ఆయన.. నేడు కూడా అదే దారిలో నడుస్తుండడంతో ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

**తల్లుల వేదన అంతా ఇంతా కాదు..**

గతంలో స్కూళ్లు తెరిచిన వారం రోజుల్లోనే 'అమ్మ ఒడి' పథకం కింద రూ.15 వేలను అప్పటి వైఎస్ జగన్ ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో జమ చేసింది. ఇటీవలి ఎన్నికల్లో ఎంతమంది పిల్ల లుంటే అంతమందికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఈ క్రమంలో సాయం కోసం తల్లిదండ్రులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు.

**రైతులకు శఠగోపం..**

ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20 వేలు ఇస్తానని బాబు నమ్మబలికారు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు సాయం ఊసే లేదు. దాని గురించి చర్చ కూడా లేదు. గత ప్రభుత్వం ఏటా రూ.13,500ను పెట్టుబడి సాయం కింద మూడు దఫాల్లో అందించింది. బాబు తన ప్రచారంలో రూ.20 వేలు అనేసరికి ఆశపడి ఓటు వేస్తే ఇప్పుడు నిలువునా ముంచారని, పైరు సాగు చేద్దామంటే పైసా సాయం ఇవ్వలేదని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 2.91 లక్షల మంది రైతులు అన్నదాతా సుఖీభవ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

**నిరుద్యోగ భృతి గాలికి..**

చదువుకుని ఉద్యోగం రాని యువకులు చంద్రబాబు మాటలు నమ్మి నిలువునా మోసపోయామంటున్నారు. నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఇస్తానన్న ఆయన గద్దెనెక్కి వంద రోజులైనా పైసా ఇవ్వలేదు. జిల్లాలో 5.29 లక్షలమంది నిరుద్యోగ భృతికోసం ఎదురు చూస్తున్నారు. బాబు మాత్రం భృతి ఊసే ఎత్తకపోవడంతో దగా పడ్డామంటూ అందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మహిళలకు మళ్లీ కుచ్చుటోపీ..!**

2019 ఎన్నికల్లో పసుపు కుంకుమ అంటూ మభ్యపెట్టి చివరికి రూ.10 వేలు అందజేసిన బాబు తన పంథా మార్చుకోలేదు. 2024 ఎన్నికల ముందు ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 చొప్పున ఇస్తానన్నారు. దీంతో మహిళలు టీడీపీకి ఓటేశారు. కానీ నేడు పైసా కూడా ఇవ్వకపోవడంతో జిల్లాలో దాదాపు 7.14 లక్షల మంది మహిళలు కూటమి ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారు.

- వీటితో పాటు ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణంపైనా ప్రజల్లో అనుమానాలు కలుగుతున్నాయి.



**జిల్లాలో రూ.1,500 పథకం అర్హులు**

18-60 ఏళ్ల మధ్య వయస్సు వారు:

**7,14,000**

గడిచిన మూడు నెలలకు ఇవ్వాల్సింది:

రూ.**321.3** కోట్లు

ప్రస్తుత పరిస్థితి: ఇంతవరకూ అతీగతీ లేదు. కూటమి ప్రభుత్వం ఈ పథకం గురించి నోరుపెదపడం లేదు.



**నిరుద్యోగులు ఇలా..**


మొత్తం నిరుద్యోగులు:

**5,29,000**

గడిచిన మూడు నెలల్లో అందాల్సిన భృతి:

రూ.**476.1** కోట్లు

ప్రస్తుత పరిస్థితి: నిరుద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎన్నో ఆశలు పెట్టుకున్న చంద్రబాబు మాట్లాడడం లేదు.



**'అన్నదాత సుఖీభవ'కు అర్హులు**

రైతుల సంఖ్య:

**2,90,899**

ఈ ఏడాది అందాల్సిన మొత్తం:

రూ.**581.79** కోట్లు

ప్రస్తుత పరిస్థితి: పథకం పేరు మార్చారు. ఆ తర్వాత మాట్లాడలేదు. ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పలేదు.



**'తల్లికి వందనం' అర్హులు**

1 నుంచి ఇంటర్ చదువుతున్న విద్యార్థుల సంఖ్య:

**4,07,900**

ఈ ఏడాది ఇవ్వాల్సిన మొత్తం:

రూ.**611.85** కోట్లు

ప్రస్తుత పరిస్థితి: ప్రతి విద్యార్థికీ అని కాకుండా ప్రతి తల్లికీ అంటూ మార్గదర్శకాలు విడుదల చేశారు. విమర్శలు రావడంతో వెనక్కు తగ్గారు.

### మాట నిలబెట్టుకోవాలి



నాకు ఇద్దరు పిల్లలు. చిన్న కుమార్తె భావన అనంతపురం శారద నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పెద్దమ్మాయి సుచిత్ర ఇంటర్. మా ఆయన మగ్గం పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి పథకం కింద ఏటా నా ఖాతాలో డబ్బు జమ చేశారు. చంద్రబాబు కూడా గత ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగా తల్లికి వందనం పథకం కింద నా పిల్లలిద్దరికీ పథకం వర్తింపజేసి మాట నిలబెట్టుకోవాలి.

– మాధవి, అనంతపురం

### తల్లికి వందనం అమలు చేయాలి



నాకు ఇద్దరు పిల్లలు. రామ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు స్కూలులో చదువుతున్నారు. ఇటీవల ఎన్నికల ముందు ఎంతమంది పిల్లలుంటే అందరికీ రూ. 15 వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు చెప్పారు. ఇప్పటిదాకా దీనిపై కనీస ప్రకటన చేయలేదు. స్కూళ్ల ప్రారంభ సమయంలో డబ్బు ఇచ్చి ఉంటే పిల్లల చదువులకు ఉపయోగపడేది. అధికారంలోకి వచ్చిన తరువాత పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా తల్లికి వందనం అమలు చేయాలి.

– జ్యోతి, అనంతపురం

### రైతులకు సాయం చేయండి



ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ పేరుతో ప్రచారం చేశారు. అధికారం వచ్చాక వాటి గురించి మరిచి పోయారు. గతంలో ఏటా ఖరీఫ్ పంటలు సాగు చేసే సమయానికి పెట్టుబడి సాయం అందేది. ఆర్‌బీకేల ద్వారా రైతుల వివరాలు సేకరించి, నేరుగా మా బ్యాంకు అకౌంట్లోనే వేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నాకు 5 ఎకరాల పొలం ఉంది. ఖరీఫ్ పెట్టుబడికి కూటమి ప్రభుత్వం ఏటా రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల ముందు గొప్పలు చెప్పింది. ఇప్పటికీ అది ఆచరణలో లేదు. రైతులకు న్యాయం చేయాలి.

– వెంకటేశులు, రైతు, ఒంటారెడ్డిపల్లి

### నిరుద్యోగ భృతి ఇవ్వాలి



కూటమి ప్రభుత్వం రాగానే ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇస్తామన్నారు. ఉద్యోగాలు వచ్చేదాకా ప్రతి నెలా రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. మాట ప్రకారం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వాలి. ఈ డబ్బుతో పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకునే అవకాశం ఉంటుంది. పేద విద్యార్థులకు ఎంతో మేలు చేసినట్లవుతుంది.

– దీక్ష ప్రియ, అనంతపురం

### 1,500 ఎప్పటినుంచి ఇస్తారో?



ఎన్నికల సమయంలో చంద్రబాబు అనేక హామీలు ఇచ్చారు. 18 ఏళ్ల నిండి 60 ఏళ్లలోపు మహిళలందరికీ అధికారంలోకి రాగానే ప్రతినెలా రూ. 1,500 ఇస్తామని చెప్పారు. నేడు దాని గురించి మాట్లాడటమే లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటినా ఈ హామీ ఊసెత్తడం లేదు. నమ్మి ఓట్లు వేసిన మహిళలను మోసం చేయరాదు. గత ప్రభుత్వం మాదిరి హామీలన్నింటినీ అమలు చేయాలి. ప్రజలకు అండగా నిలవాలి.

– షాలినిదేవి, అనంతపురం



తెదేపా సూపర్ సిక్స్ ముందు.. వైకాపా గ్రాఫ్ పడిపోయింది: కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: వైకాపా ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో ఆ పార్టీ శ్రేణులే తీవ్ర నిరాశ నిస్పృహల్లో కనిపిస్తున్నారని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆయన ఉరవకొండ మండలం బూదగవిలో విలేకరులతో మాట్లాడారు. ఆ ... ముందు వైకాపా గ్రాఫ్ పూర్తిగా పడిపోయిందన్నారు. సూపర్ సిక్స్ విధానం మరింత స్పీడ్‌గా వెళ్లనుందని చెప్పారు. వైకాపా ఎన్నికల ప్రణాళిక విషయంలో ఏవేవో గొప్పలు చెప్పుకొన్న వాళ్లు సైతం నోరు తెరవని పరిస్థితి నెలకొంద

మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

### హామీలు గుర్తున్నాయా అమాత్యా...?

ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలపై ప్రస్తుత మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడిన మాటలు.. (ఈనాడు దినపత్రికలో)

ఎన్నికల సమయంలో ప్రస్తుత బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఇంటర్వ్యూ..



## క్లుప్తంగా

### బ్యాంకుల వద్ద పటిష్ట భద్రత


రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు

**అనంతపురం:** రాత్రి వేళల్లో బ్యాంకులు, ఏటీఎం కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ పి.జగదీష్ పేర్కొన్నారు. అక్రమ మద్యం, ఇసుక, గంజాయి, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేలా తనిఖీలు చేపట్టడంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేసి రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు.

### విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి


నరసింహులు (ఫైల్)

**ఉరవకొండ:** విద్యుత్ షాక్‌కు గురై ఓ కౌలు రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి చెందిన నరసింహులు (45)కు భార్య నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని పోషించుకునే నరసింహులు 5 ఎకరాల పెన్న హోబిలం ఆలయ మాన్యం భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ సాగు చేస్తున్నాడు. బుధవారం పొలంలో బోరుబావికి ఏర్పాటు చేసిన మోటారుకు విద్యుత్ సరఫరా కాని విషయాన్ని గుర్తించిన ఆయన మరమ్మతుకు పూనుకున్నాడు. ఆ సమయంలో ఉన్నఫళంగా కరెంట్ ప్రసరించడంతో షాక్‌కు గురై కుప్పకూలాడు. గమనించిన చుట్టు పక్కల పొలాల్లో పనిచేస్తున్న కూలీలు వెంటనే నరసింహులును ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, నరసింహులు కుటుంబసభ్యులకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని జిల్లా కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు పెద్ద ముష్టూరు వెంకటేష్ డిమాండ్ చేశారు.

### టీసీసీ ఫలితాల విడుదల

**అనంతపురం ఎడ్యుకేషన్:** టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ) ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో టీసీసీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు నిర్వహించగా.. ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు డీఈఓ వరలక్ష్మి, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్ బుధవారం వెల్లడించారు.

### అధికార లాంఛనాలతో ఏఆర్ ఎస్‌ఐ అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం:** అనారోగ్యంతో మృతి చెందిన ఏఆర్ ఎస్‌ఐ బి.నాగరాజుకు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. 1990లో పోలీసు శాఖలో చేరిన ఆయనకు భార్య బి.పద్మావతి, కుమారుడు రాహుల్, కూతురు దివ్యదర్శిని ఉన్నారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి మరణించారు. దీంతో బుధవారం ఉదయం అనంతపురంలోని నవోదయ కాలనీ శ్మశాన వాటికలో అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యుడు సాకే త్రిలోక్ నాథ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కమిటీ సభ్యులు గాండ్ల హరినాథ్, లక్ష్మీనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

**శెట్టూరు:** భూమిపై పడుతున్న ప్రతి వర్షం బొట్టునూ ఒడిసి పడదామంటూ కలెక్టర్ వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. 'ప్రపంచ నీటి పరిరక్షణ దినోత్సవం' సందర్భంగా శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లిలో బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అంతకు ముందు వాటర్ షెడ్ పనులతో పాటు 22 మంది రైతులు 89 ఎకరాల్లో 5 లేయర్ క్రాప్ పద్ధతిలో సాగు చేసిన మామిడి ఉసిరి, సీతాఫలం, జామ, నేరేడు పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలతో రైతు అంజన్‌రెడ్డి చేపట్టిన టమాట సాగును పరిశీలించి, సాగు విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆదే రైతు చేపట్టిన పాడి పోషణను గమనించి అభినందించారు. తమ గ్రామానికి బస్సు సౌకర్యంతో పాటు డెయిరీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా స్థానికులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. అనంతరం గ్రామంలో రైతులతో సమావేశమై మాట్లాడారు. వాటర్‌షెడ్ పనుల వల్ల భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయన్నారు. దీంతో సాగు, తాగునీటి సమస్యలు తీరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాణి సుస్మిత, డీఏఓ ఉమామహేశ్వరమ్మ, ఎంపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, డీహెచ్ఓ నరసింహారావు, డీఎల్‌డీఓ శంకర్, ఏడీఏ యల్లప్ప, తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, తదితర అధికారులు, ఎకాలజీ సెంటర్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

**పౌష్టికాహారంతో ఆరోగ్యం**

పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని కలెక్టర్ సూచించారు. ఎర్రబోరేపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పౌష్టికాహార మహోత్సవాలను బుధవారం ఆయన పరిశీలించి, మాట్లాడారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడి, పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలపై చైతన్యపరిచారు. అనంతరం ఆర్డీఓ రాణిసుస్మిత, సీడీపీఓ వనజాఅక్కమ్మతో కలసి గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధమ్మ, ఎంఈఓ శ్రీధర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి**

**కళ్యాణదుర్గం రూరల్/కుందుర్పి:** ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలని రైతులకు కలెక్టర్ సూచించారు. బుధవారం కళ్యాణదుర్గం మండలం వెంకటాంపల్లిలో నిర్మాణంలో ఉన్న కోల్డ్ స్టోరేజ్‌ను ఆయన పరిశీలించి, రైతులతో మాట్లాడారు. త్వరలో బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల నుంచి కార్పొరేట్ సంస్థలను ఆహ్వానించి జిల్లా స్థాయిలో వ్యవసాయోత్పత్తుల అమ్మకం దారుల సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి నరసింహారావు, ఆర్డీఓ రాణిసుష్మిత, స్థానిక రైతులు పాల్గొన్నారు. అనంతరం కుందుర్పి మండలం అప్పిలేపల్లిలో మెట్ట రైతులు పరస్పర సహకార సంఘం ఆధ్వర్యంలో 22 మంది రైతులు వంద ఎకరాల్లో చేపట్టిన అల్లనేరేడు, ఉసిరి, జామ తదితర తోటలను పరిశీలించి, సాగు విధానాలను రైతులతో ఆరా తీశారు. పండ్లతోటల పెంపకానికి ఎఎఫ్ ఎకాలజీ సంస్థ అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుష్మిత, డీఎల్‌డీఓ శంకర్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ, తదితరులు పాల్గొన్నారు.

### లోకో పైలెట్ దుర్మరణం


మహమ్మద్ రఫీ (ఫైల్)

**గుంతకల్లు రూరల్:** ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో లోకో పైలెట్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని ఇందిరానగర్‌లో నివాసముంటున్న షేక్ మహమ్మద్ రఫీ (38) గుత్తి రైల్వేలో లోకో పైలెట్‌గా విధులు నిర్వర్తించేవాడు. భార్య అఫ్రిన్, 8, 6 సంవత్సరాల వయసున్న ఇద్దరు కుమారులు ఉన్నారు. సెలవులో ఉన్న మహమ్మద్ రఫీ మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై గుంతకల్లు శివారులోని చెన్నప్ప కొట్టాల మీదుగా వెళుతుండగా ఓ మలుపు వద్ద నియంత్రణ కోల్పోవడంతో వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లింది. బుధవారం వేకువజాము 1.30 గంటల సమయంలో కాలువలో పడిన ద్విచక్ర వాహనం నుంచి వెలుగుతున్న లైట్‌ను అటుగా వెళుతున్న వాహనదారులు గమనించి చుట్టుపక్కల పరిశీలించారు. అప్పటికే అపస్మార స్థితిలో ఉన్న మహమ్మద్ రఫీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించి 108 అంబులెన్స్ ద్వారా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు కసాపురం ఎస్‌ఐ నరేంద్రకుమార్ తెలిపారు.

# ఆక్సిజన్ అందక.. ఊపిరి ఆగింది

- ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బాధితుల ఆందోళన
- చిన్నారి మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్


ఆక్సిజన్ అందక చిన్నారి మృతి చెందినట్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాన్ని చూపుతున్న షఫి

**గుంతకల్లు:** ప్రైవేట్ ఆస్పత్రి నిర్వాహకుల నిర్లక్ష్యమే తమ చిన్నారిని పొట్టనబెట్టుకుందంటూ బాధిత కుటుంబసభ్యులు బుధవారం సదరు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు.... గుంతకల్లు మండలం ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన జాస్మిన్, షఫీ దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. వారం రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్న రెండో కుమారుడు ఇంతియాజ్ (1)ను గుంతకల్లు బస్టాండ్ సమీపంలో ఉన్న ఆర్‌టీ గుప్తా ఆస్పత్రికి షఫీ దంపతులు తీసుకెళ్లి అడ్మిట్ చేయించారు. చికిత్సల అనంతరం బుధవారం శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని గుర్తించిన వైద్యులు వెంటనే కర్నూలుకు రెఫర్ చేస్తూ ఓ అంబులెన్స్‌ను ఏర్పాటు చేయించారు. మార్గం మధ్యలో ప్యాపిలి వద్దకు చేరుకోగానే ఆక్సిజన్ అయిపోవడంతో చిన్నారి ఊపిరి అందక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో డోన్‌లోని ఓ ఆస్పత్రికి చేర్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందాడని, అక్సిజన్ అందకపోవడమే మృతికి కారణమంటూ నిర్ధారించారు. దీంతో అంబులెన్స్ డ్రైవర్ సలీమ్‌ను బాధిత కుటుంబసభ్యులు నిలదీశారు. సిలిండర్‌లో 40 శాతం మాత్రమే ఆక్సిజన్ ఉండేదని, ప్యాపిలి సమీపంలోకి చేరుకోగానే అది కాస్త అయిపోయినట్లు తెలిపాడు. అయితే ఆక్సిజన్ సిలిండర్ ఫుల్‌గా లేని విషయం తెలిసి కూడా ఎందుకు వచ్చావంటూ ప్రశ్నించడంతో బాధితులపైనే డ్రైవర్ దౌర్జన్యానికి దిగాడు. ఈ విషయంగా తననేమీ ప్రశ్నించకూడదని ఏదైనా ఉంటే ఆర్‌టీ గుప్తా ఆస్పత్రి నిర్వాహకులతో తేల్చుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడంతో చిన్నారి మృతదేహంతో సదరు ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట బాధిత కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు. చిన్నారి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న సీఐలు మనోహర్, మహేశ్వర్‌రెడ్డి ఆందోళనకారులతో మాట్లాడి, రాజీ మార్గం ద్వారా సమస్యకు పరిష్కారం చూపారు.

### విద్యుత్ చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసు

- విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎస్‌ఈ శ్రీనివాసబాబు


వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**అనంతపురం టౌన్:** విద్యుత్ చౌర్యానికి పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆ శాఖ విజిలెన్స్ విభాగం ఎస్‌ఈ శ్రీనివాసబాబు హెచ్చరించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎలాంటి మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 18మందిని గుర్తించి కేసులు నమోదు చేసి, రూ.2.49 లక్షల జరిమానా విధించారు. అనంతపురంలోని డీ5 పరిధిలో 5 కేసులు, అమరాపురం మండలంలో 5, ఓబుళదేవర చెరువులో 8 కేసులు నమోదయ్యాయి. కొందరు మీటర్లు లేకుండా ప్రధాన విద్యుత్ లైన్లకు తీగలు తగిలించి విద్యుత్ వినియోగిస్తున్నట్లుగా గుర్తించారు. మరి కొందరు మీటర్లు ఉన్నా... వాటి ద్వారా కాకుండా నేరుగా విద్యుత్‌ను వినియోగించుకున్నట్లుగా నిర్ధారణ అయింది. దీంతో వారిపై మాల్ ప్రాక్టీస్, డైరెక్ట్ టాపింగ్, పిల్ఫరేజ్ కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు ఈఈ గోపి, డీఈలు రామాంజినేయులు, నాగేంద్ర, ఏఈ పీరా పాల్గొన్నారు.

### టీ స్టాల్‌లో చోరీ


చోరీకి పాల్పడిన వ్యక్తి (సీసీ ఫుటేజీ)

**గుంతకల్లు:** స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు కూతవేట దూరంలో ఉన్న ఓ టీ స్టాల్‌లో చోరీ జరిగింది. దాదాపు రూ.1.15 లక్షల నగదుతో పాటు రూ.15 వేలు విలువ చేసే సిగరెట్ల బండిళ్లను అపహరించుకెళ్లినట్లు బాధితుడు గోవిందు తెలిపారు. అయ్యప్ప స్వామి భక్తుడైన ఆయన దాదాపు 80 మంది భక్తులతో కలసి జనవరిలో శబరిమల వెళ్లడానికి సిద్ధమై, రైలు టికెట్లు రిజర్వేషన్ చేయించే క్రమంలో వసూలైన రూ.1.15 లక్షలను మంగళవారం రాత్రి క్యాష్ కౌంటర్‌లో ఉంచి తాళం వేసి ఇంటికి చేరుకున్నాడు. బుధవారం తెల్లజాము 4.00 గంటలకు టీస్టాల్‌కు చేరుకున్న ఆయన తాళం బద్ధలుగొట్టి ఉన్న విషయం గుర్తించి లోపలకు వెళ్లి పరిశీలించాడు. క్యాష్ కౌంటర్‌లో ఉంచిన నగదుతో పాటు 4 సీసీ కెమెరాలను అపహరించుకెళ్లినట్లు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. సీసీ కెమెరా ఫుటేజీల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి దృశ్యాలను పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

### కణేకల్లు హోండా షోరూంలో చోరీ

**కణేకల్లు:** స్థానిక రామనగర్‌లో ఉన్న హోండా షోరూంలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. షోరూమ్ యజమాని దాదాపీర్ తెలిపిన మేరకు... రెండో శనివారం నుంచి వరసగా బ్యాంకు సెలవులు ఉండడంతో మూడ్రోజుల వ్యాపార లావాదేవీల ద్వారా సమకూరిన డబ్బును మంగళవారం రాత్రి ఫస్ట్ ఫ్లోర్‌లో ఉన్న రెండు క్యాష్ కౌంటర్ల డ్రా లో ఉంచి, సెకెండ్ ఫ్లోర్‌లో ఉన్న ఇంట్లో కుటుంబసభ్యులతో కలిసి దాదాపీర్ నిద్రపోయాడు. బుధవారం తెల్లవారుజాము 4 గంటల సమయంలో కాలినడకన వచ్చిన ఇద్దరు యువకులు షోరూంలో చొరబడి క్యాష్ కౌంటర్ల ఉంచిన రూ.2 లక్షలను అపహరించుకెళ్లారు. ఉదయం చోరీ విషయాన్ని గుర్తించిన బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నాగమధు తెలిపారు.

### ఇసుక టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు


పోలీసుల అదుపులో ఉన్న టిప్పర్

**శింగనమల:** మండలంలోని పి.జలాలపురం వద్ద కూతలేరు వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టీడీపీ నాయకుల టిప్పర్లను మంగళవారం రాత్రి స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న సీఐ కౌలుట్లయ్య, సిబ్బంది అక్కడకు చేరుకుని టిప్పరను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కాగా, వారం రోజుల క్రితం పి.జలాలపురం, పెరవలిలో రెవెన్యూ, మైన్స్, పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న నలుగురుపై కేసులు నమోదు చేశారు. పెరవలిలో 94 టన్నులు, పి.జలాలపురంలో 135 టన్నుల ఇసుకను సీజ్ చేశారు. అయితే ఈ ఇసుక కనిపించక పోవడం గమనార్హం.

# చి'వరి'కి నిరాశేనా..?

- హెచ్చెల్సీ చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- ప్రజాప్రతినిధులు గళం విప్పితేనే రైతులకు న్యాయం
- నేడు ఐఏబీ సమావేశం

**అనంతపురం సెంట్రల్:** సాగునీరు కేటాయింపులో చివరి ఆయకట్టు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. పంటల సాగు దగ్గర నుంచి చేతికందే వరకూ రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.నీటి నిర్వహణలో సరైన ప్రణాళికలు లేకపోవడంతో దుస్థితి నెలకొంటోంది. ఈ సారి కూడా ఆయా రైతులు పంటలు సాగు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. గురువారం కలెక్టరేట్‌లో సాగునీటి సలహా మండలి సమావేశం జరుగుతున్నా దృష్ట్యా చివరి ఆయకట్టు రైతులకు న్యాయం జరిగేలా ప్రజాప్రతినిధులు గళం విప్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. హెచ్చెల్సీ కింద (అనంతపురం, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలు) మొత్తం 2,84,922 ఎకరాల లోకలైజ్డ్ ఆయకట్టు ఉంది. కానీ ఏటా లక్ష ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తున్నారు. అందులోనూ 80 వేల ఎకరాల్లోపై సాగు జరుగుతోంది.

**రిజర్వాయర్లు నిండేదెన్నడో?**

తుంగభద్ర జలాశయం నుంచి రెండు నెలలుగా హెచ్చెల్సీకి నీరు విడుదల అవుతోంది. ఈ ఏడాది దామాషా ప్రకారం 26.368 టీఎంసీలు కేటాయించారు. ఇప్పటి వరకూ జలాశయం వద్ద 8.893 టీఎంసీలు విడుదల చేయగా జిల్లా సరిహద్దుకు 7.732 టీఎంసీలు వచ్చాయి. రోజూ 1,814 క్యూసెక్కులు చొప్పున నీటిని డ్రా చేస్తున్నారు. ఈ నీటిని ఎగువన ఉన్న హెచ్ఎల్ఎంసీ (హైలెవల్ మెయిన్ కెనాల్), గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద ఆయకట్టుకు వదిలి, దిగువన ఉన్న పీఏబీఆర్, ఎంపీఆర్ రిజర్వాయర్లను నింపుతున్నారు. అయితే పీఏబీఆర్‌కు 411 క్యూసెక్కులు, ఎంపీఆర్‌కు 250 క్యూసెక్కులు మాత్రమే వస్తున్నాయి. అతి తక్కువగా నీరు వస్తుండడంతో రిజర్వాయర్లు గరిష్ట మట్టానికి ఎప్పుడు చేరుకుంటాయో, ఆయకట్టుకు ఎప్పుడు వదులుతారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం పీఏబీఆర్‌లో 2.124, ఎంపీఆర్‌లో 1.546 టీఎంసీల నీరు ఉంది. కనీసం 4 టీఎంసీలకు పైగా చేరితే తప్ప ఆయకట్టుకు వదలలేని పరిస్థితి ఉంది.

**ప్రశ్నార్థకంగా ఆయకట్టు..**

ఎగువన ఉన్న హైలెవల్ మెయిన్ కెనాల్, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్స్ కింద రైతులకు మాత్రమే సాగునీరు అందుతోంది. దిగువన ఉన్న గుత్తి సబ్ బ్రాంచ్ కెనాల్, ఆలూరు బ్రాంచ్‌కెనాల్, మిడ్ పెన్నార్ సౌత్, నార్త్ కెనాల్స్, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్స్‌కు నీరు విడుదల చేస్తారో ప్రశ్నార్థకంగా మారింది. గుత్తి, ఆలూరు, తాడిపత్రి, మిడ్‌పెన్నార్‌సౌత్, నార్త్ కెనాల్ కింద రెండు, మూడేళ్లకోసారి మాత్రమే పంటలు పండించుకుంటున్నారు. ఈ అంశంపై లోతుగా చర్చించి చివరి ఆయకట్టు రైతులకు కూడా పంటలు పండించుకునేలా ఓ నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఉప కాల్వల కింద ఆయకట్టు వివరాలు**

| ఉప కాల్వ పేరు | లోకలైజ్డ్ ఆయకట్టు (ఎకరాలు) |
|---|---|
| హైలెవల్ మెయిన్ కెనాల్ | 35,541 |
| గుంతకల్ బ్రాంచ్ కెనాల్ | 15,792 |
| గుత్తి సబ్ ఉపకాలువ | 16,271 |
| ఆలూరు బ్రాంచ్ కెనాల్ | 14,255 |
| మిడ్ పెన్నార్ సౌత్ కెనాల్ | 33,176 |
| మిడ్‌పెన్నార్ నార్త్ కెనాల్ | 13,325 |
| తాడిపత్రి బ్రాంచ్ కెనాల్ | 31,131 |


### బైక్ దగ్ధం

**తాడిపత్రి రూరల్:** మండలంలోని చుక్కలూరు నివాసి రాముకు చెందిన బులెట్ బైక్ అగ్నికి ఆహుతైంది. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వాహనం కాలిపోయిందని, తనకు ఎవరిపై అనుమానం లేదని విచారణకు వెళ్లిన పోలీసులకు బాధితుడు తెలిపాడు. కేసు నమోదుకు నిరాకరించడంతో పోలీసులు వెనుదిరిగారు.

### బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

**అనంతపురం:** బడి ఈడు పిల్లలందరూ బడిలో ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి జి.శివప్రసాద్ యాదవ్ అన్నారు. అనంతపురంలోని సాయి నగర్‌లో జాతీయ నిర్మాణ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. చట్టాలపై అవగాహన కలిగి బాధ్యతాయుతంగా అడుగులు వేసినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని యువతకు సూచించారు.

ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ.. బాల్య వివాహాలు నిరోధించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్మిక శాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ.. అసంఘటిత కార్మికులు విధిగా తమ పేర్లను కార్మికశాఖలో నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో జాతీయ నిర్మాణ అకాడమీ సంచాలకులు గోవిందరాజులు, న్యాయవాది హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# హామీలన్నీ హాంఫట్ !

హామీలిచ్చి.. ఎగ్గొడుతున్న కూటమి ప్రభుత్వం

గెలిచాక నోరు మెదపని సీఎం చంద్రబాబు

హామీలన్నీ అమలు చేయాలని ప్రజల డిమాండ్

సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు బాబూ ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ అంటూ ఊదరగొట్టారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని కూటమి నాయకులు ఊరూరా ప్రచారం చేశారు. ఇదే విధంగా రాప్తాడు నియోజకవర్గంలో కూడా టీడీపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచిన పరిటాల సునీత కూడా సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటా ప్రచారం చేసి ప్రజలను ఓట్లు అడిగి వేయించుకున్నారు. టీడీపీ ప్రభుత్వం రాగానే తల్లికి వందనం కింద బడికి వెళ్లి చదువుకునే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, నిరుద్యోగ భృతి యువతకు నెలకు రూ.3 వేలు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1,500 తదితర పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు కావొస్తున్నా వీటిలో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం పొందేందుకు అనంతపురం అర్బన్‌లో 2,07,070, రాప్తాడు నియోజకవర్గంలో 1,40,000 మంది మహిళలు నిరీక్షిస్తున్నారు. ఇక ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు పొందేందుకు అనంతపురం అర్బన్‌లో 1,77,904, రాప్తాడు నియోజకవర్గంలో 65,000 మంది ఆశగా ఎదురు చూస్తున్నారు.

– కనగానపల్లి/రాప్తాడు/రామగిరి/చెన్నేకొత్తపల్లి/ఆత్మకూరు/అనంతపురం/అనంతపురం కార్పొరేషన్:


### జగన్ పాలనలో రైతులకు అందిన సాయం

| పథకం | నియోజకవర్గం | లబ్ధి |
|---|---|---|
| రైతు భరోసా | అనంతపురం అర్బన్ | రూ.2.01 కోట్లు |
| | రాప్తాడు | రూ.394.85 కోట్లు |



### జగన్ పాలనలో తల్లులకు అందిన సాయం

| పథకం | నియోజకవర్గం | లబ్ధి |
|---|---|---|
| అమ్మఒడి | అనంతపురం అర్బన్ | రూ.191.14 కోట్లు |
| | రాప్తాడు | రూ.147 కోట్లు |




నియోజకవర్గాల వారీగా అర్హులు

అనంతపురం అర్బన్ : 1,76,303

రాప్తాడు : 85,000

నెలకు ఇవ్వాల్సిన సాయం: రూ.39.19 కోట్లు




నియోజకవర్గాల వారీగా అర్హులు

అనంతపురం అర్బన్ : 76,948

రాప్తాడు : 78,000

నెలకు ఇవ్వాల్సిన సాయం: రూ.46.48 కోట్లు



### టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి రైతులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా అర్హులు

అనంతపురం అర్బన్ : 250 | రాప్తాడు: 58,500

ఇవ్వాల్సిన సాయం : రూ.117.50 కోట్లు



### టీడీపీ పాలనలో ఒక్కో ఏడాదికి తల్లులకు అందాల్సిన సాయం

నియోజకవర్గాల వారీగా అర్హులు

అనంతపురం అర్బన్: 32,988 | రాప్తాడు : 35,935

ఇవ్వాల్సిన సాయం : రూ.103.38 కోట్లు

## అలవికాని హామీలు ఇచ్చి ప్రజలకు కుచ్చుటోపీ








తెదేపాతోనే అభివృద్ధి: సునీత

జాకీర్ కొట్టాల్లో సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ఆడబిడ్డ నిధి పేరుతో మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామని, సూపర్ సిక్స్ అమలు చేస్తామని ప్రకటనలు ఇచ్చిన ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత (ఫైల్)

### చేతకాకుంటే దిగిపోండి..



చంద్రన్న గతంలో అధికారంలోకి రావడానికి 600 హామీలు ఇచ్చాడు. దాంట్లో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. ప్రస్తుతం అధికారంలోకి రావడానికి సూపర్-6 అంటూ మళ్లీ ప్రజల్లోకి వచ్చి అబద్ధపు హామీలు చెప్పి అధికారం చేపట్టాడు. మహిళలకు రూ.1,500 ఇస్తామని చెప్పారు. ఎప్పుడు ఇస్తారో తెలియదు. పాలన చేతకాకుంటే దిగిపోవాలి.

– బుడగ ఓబులమ్మ, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

### మాకు రూ.75 వేలు ఇవ్వాల్సిందే..



మాది రామగిరి మండలం మాదాపురం గ్రామం. మాకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. వీరంతా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటున్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు తల్లికి వందనం కింద బడికి పోయే పిల్లలందరికీ ఒక్కొక్కరికి రూ.15 వేల ప్రకారం ఇస్తామన్నారు. ఈ లెక్కన నా ఐదుగురు పిల్లలకు కలిపి రూ.75 వేలు ఇవ్వాల్సిందే. పాఠశాలలు తెరిచి చాలా రోజులవుతోంది. ఒక్కరికీ డబ్బులు రాలేదు. పిల్లలను బడులకు పంపాలంటే కష్టంగా ఉంది.

– సాకే లక్ష్మీదేవి, మాదాపురం గ్రామం, రామగిరి మండలం

### రైతులంటే లెక్క లేదా?



ప్రభుత్వం అన్నదాతలకు పంటల సాగుకు సహాయం అందించి ఆదుకోవాలి. మా ప్రాంతంలో గత కొన్నేళ్లుగా వర్షాలు సకాలంలో కురవక సాగు చేసిన పంటలు పండక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించి ప్రోత్సహించేది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాల్సిందే. ఈ ప్రభుత్వానికి రైతులంటే లెక్క లేదు.– వెంకటేష్, వెంకటంపల్లి, చెన్నేకొత్తపల్లి మండలం

### పిల్లల ఫీజులు కట్టాలి



తల్లికి వందనం పథకం కింద ఇంటిలో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అంతమందికి రూ.15 వేలు ఇస్తామన్నారు. బడులు తెరిచి 4 నెలలు అవుతున్నా ఇంకా ఒక్కరికి కూడా ఇవ్వలేదు. మాకున్న ముగ్గురు పిల్లల్ని అనంతపురంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిస్తున్నాం. మా ముగ్గురు పిల్లలకు రూ.45 వేలు ఇవ్వాల్సిందే.

– సుజాత, రెడ్డివారిపల్లి, రామగిరి

### నిరుద్యోగులకు మళ్లీ నిరాశేనా?



టీడీపీ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం లేదా రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పారు. ప్రస్తుతం నిరుద్యోగ భృతి గురించి పట్టించుకునే నాథులే కరువయ్యారు. నిరుద్యోగులకు మళ్లీ నిరాశ తప్పదు అనిపిస్తోంది. – అశోక్, బద్దలాపురం, కనగానపల్లి మండలం

---

## క్లుప్తంగా

### వైఎస్ జగన్‌తో ఎల్ఎం భేటీ



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని బుధవారం విజయవాడలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందించారు.

### అనంతను కలసిన నాయకులు

**అనంతపురం కార్పొరేషన్:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్షుడిగా అనంతను నియమించడాన్ని స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. అనంతరం అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రవికాంత్ రెడ్డి, చెన్నారెడ్డి, ఖాదర్ బాషా, మురళీ, గఫ్ఫార్, రవి, దాదావలి, ఇమ్రాన్, లీగల్ సెల్ నాయకులు నరసింహారెడ్డి, వెంకటరాముడు, శ్రీనివాస్ రెడ్డి, నాగేంద్ర, విద్యాపతి, ఆలూరు రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### అనంతపురం రూరల్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ

**రాప్తాడు:** అనంతపురం రూరల్ డీఎస్పీగా టి.వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన డీఎస్పీ వెంకట శివారెడ్డి అనంతపురానికి బదిలీపై వెళ్లారు. రాప్తాడు సీఐ టీ.వి.శ్రీహర్ష, పోలీసులు నూతన డీఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

**అనంతపురం కార్పొరేషన్:** ప్రజల భాగస్వామ్యంతోనే పరిసరాల శుభ్రత సాధ్యపడుతుందని మేయర్ వసీం పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో అంబేడ్కర్ నగర్‌లో మురుగు కాలువల శుభ్రత, అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుభ్రతపై స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాలు, రోడ్లు, కాలువలు, ప్రభుత్వ కార్యాలయాలు శుభ్రం చేయడం జరుగుతోందన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం దేశ వ్యాప్తంగా 15 రోజుల పాటు నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛత ర్యాంకుల్లో అనంత నగరాన్ని ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, కమల్‌భూషణ్, వైఎస్సార్ సీపీ నాయకులు కుళ్లాయస్వామి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మేయర్ వసీం

**పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ**

**అనంతపురం ఎడ్యుకేషన్:** స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం పరిసరాల పరిశుభ్రతపై నగరంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి మాట్లాడుతూ.. మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జాతీయ సేవా పథకం అధికారులు జి.ఆనంద్ బాబు, ఎస్.పురుషోత్తం, వలంటీర్లు వార్షిత, లోహిత, తరుణి, నితిన్, మదన్, సుహేల్ పాల్గొన్నారు.

## ఐఎస్‌టీఈ సెక్షన్‌కు జాతీయ అవార్డు

**అనంతపురం:** ఐఎస్‌టీఈ (ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) ఏపీ సెక్షన్‌కు జాతీయ అవార్డు రావడం గర్వకారణమని జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలో బుధవారం మాజీ వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అధ్యక్షతన ఐఎస్‌టీఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరానికి సంబంధించి జాతీయ స్థాయిలో అత్యధికంగా ఇనిస్టిట్యూషనల్ మెంబర్‌షిప్ జరగడం ప్రశంసనీయమన్నారు. మన రాష్ట్రంలో ఐఎస్‌టీఈ అభివృద్ధి చెందడానికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రతిభను కనబరిచిన వారిని ఎంపిక చేశామన్నారు.



ఇన్‌చార్జ్ వీసీ హెచ్.సుదర్శన రావును సన్మానిస్తున్న దృశ్యం

అక్టోబర్ 25న కర్నూలులోని పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఈశ్వరర రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌టీఈ ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

### క్రికెటర్ల ముమ్మర ప్రాక్టీస్

**అనంతపురం:** దులీప్ ట్రోఫీలో భాగంగా ఆఖరి రౌండ్ మ్యాచ్‌లు గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. ఇండియా–ఏ, బీ, సీ, డీ జట్ల క్రికెటర్లు బుధవారం ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్‌లో ముమ్మరంగా ప్రాక్టీస్ చేశారు. సూర్యకుమార్ యాదవ్, మయాంక్ అగర్వాల్, అభిమన్యు ఈశ్వరన్, ముషీర్ ఖాన్, తనూష్ కోటియన్, రింకూ సింగ్, కేఎస్ భరత్, తదితర స్టార్ క్రికెటర్లు నెట్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్ ప్రాక్టీస్ చేశారు.



### నగరపాలక సంస్థ కమిషనర్‌గా నాగరాజు



కమిషనర్ నాగరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

**అనంతపురం కార్పొరేషన్:** నగరపాలక సంస్థ కమిషనర్‌గా జి.నాగరాజు బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. విశాఖపట్టణంలో ఆర్డీగా ఉన్న ఆయన బదిలీపై అనంతపురం నగరపాలక సంస్థకు వచ్చిన విషయం విదితమే. మునిసిపల్ ఆర్డీ, ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ఉన్న పీవీవీఎస్ మూర్తి బుధవారం రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ నాగరాజుకు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఆర్ఓ సతీష్, ఆర్ఐలు మురళీ, వేణుగోపాల్, తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. నగరాభివృద్ధికి అందరూ అంకితభావంతో పని చేయాలని నూతన కమిషనర్ సిబ్బందికి సూచించారు.

### మునిసిపల్ ఆర్డీకి వీడ్కోలు

**అనంతపురం కార్పొరేషన్:** మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి సేవలు మరువలేనివని అధికారులు పేర్కొన్నారు. పీవీవీఎస్ మూర్తి విజయవాడకు బదిలీ కావడంతో బుధవారం మునిసిపల్ ఆర్డీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి నిబద్ధతతో పని చేసే వారని కొనియాడారు. కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాథ్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ ఆర్డీ సంజీవకుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ నాగరాజు, అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, మునిసిపల్ కమిషనర్లు దివాకర్ రెడ్డి, వంశీకృష్ణ భార్గవ్, వెంకటరామయ్య, జబ్బార్‌మియా, కిరణ్‌కుమార్, ప్రహల్లాద్, శ్రీకాంత్ రెడ్డి, రంగస్వామి, వాసుబాబు, రఘునాథ్ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, ఆర్ఓ సతీష్, టీపీఓ శిరీష, సిబ్బంది శ్రీకాంత్, ఉదయ్‌కుమార్ రెడ్డి, దుర్గాంజలి, తదితరులు పాల్గొన్నారు.

**నూతన మునిసిపల్ ఆర్డీగా విశ్వనాథ్**

నూతన మునిసిపల్ ఆర్డీగా విశ్వనాథ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్‌చైర్మన్‌గా ఉన్న ఈయన బదిలీపై మునిసిపల్ ఆర్డీగా వచ్చారు.

## జీఎంసీని అగ్రస్థానంలో నిలుపుదాం

**అనంతపురం మెడికల్:** సమష్టి కృషితో రాష్ట్రస్థాయిలో అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాలను అగ్రస్థానంలో నిలుపుదామని వైద్య కళాశాల డీన్, ప్రిన్సిపల్ డాక్టర్ మాణిక్యరావు పిలుపునిచ్చారు. వైద్య కళాశాలలో 150 సీట్లు ఉన్న యూజీ సీట్ల సంఖ్య 200కు చేరడంతో బుధవారం కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఎస్ఎంసీ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావుకు పుష్పగుచ్ఛం, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. దశాబ్ద కాలంగా ఎదురుచూస్తున్న యూజీ సీట్ల పెంపు సాధ్యపడిందన్నారు. మౌలిక సదుపాయాల పెంపుతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో వైద్య విద్యలో కొత్త పుంతలు తీసుకురావడం జరిగిందన్నారు. విద్యార్థులు మరింత సులువుగా విద్యనభ్యసించేలా సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఈ ఏడాది నుంచే పెరిగిన సీట్ల భర్తీ ప్రక్రియ మొదలవుతుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలకు అంతర్జాతీయ ప్రమాణాలు ఉన్నట్లు ప్రశంసా పత్రం లభించిందన్నారు. ఎస్ఎంసీ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు ప్రత్యేక చొరవతో యూజీ సీట్ల పెంపు సాధ్యపడిందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ సంధ్య, కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, డాక్టర్ బసిరెడ్డి ప్రవీణ, డాక్టర్ మల్లిక, డాక్టర్ మాధవి, తదితరులు పాల్గొన్నారు.



వైద్య కళాశాల డీన్ డాక్టర్ మాణిక్యరావును సన్మానిస్తున్న ఎస్ఎంసీ కో–ఆర్డినేషన్ కమిటీ సభ్యులు

## జేఎన్‌టీయూలో స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్

**అనంతపురం:** జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ (ఎస్ఐహెచ్)–2024 నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.చెన్నారెడ్డి హాజరై మాట్లాడారు. నూతన ఆవిష్కరణలకు స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ విద్యార్థులకు దోహదపడుతోందన్నారు. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు పెంపొందించుకోవచ్చన్నారు. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ జి.మమత, డాక్టర్ బి. ఓం ప్రకాష్ కోఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ప్రోగ్రాం న్యాయ నిర్ణేతలుగా ప్రొఫెసర్ పి.రమణా రెడ్డి, ప్రొఫెసర్ ఆర్.రాజశేఖర్, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖర్ రెడ్డి, ప్రొఫెసర్ ఎస్.చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ ఎం.కళ్యాణ్ కుమార్ వ్యవహరించారు.



విద్యార్థుల ఆవిష్కరణలపై మూల్యాంకనం చేస్తున్న న్యాయ నిర్ణేతలు

### హుండీల లెక్కింపు

**అనంతపురం:** గతేడాది త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా వివిధ సంస్థలు, పాఠశాలలు, కళాశాలల నుంచి సేకరించి హుండీలను బుధవారం లెక్కించారు. మొత్తం రూ.42,597 త్రివిధ సాయుధ దళాల పతాక అకౌంట్‌కు జమ చేసినట్లు జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారి పి.తిమ్మప్ప తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బలరామ్ రావు, డిటీ మాధవ కృష్ణయ్య, ఎక్స్ సర్వీస్‌మెన్ అసోసియేషన్ తరఫున విశ్వేశ్వరయ్య, పెంచలయ్య, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## కార్గో సేవలు ప్రజల్లోకి తీసుకెళ్లండి

**అనంతపురం క్రైం:** ఆర్టీసీ సేవల్లో ప్రయాణికుల ప్రాధాన్యతకు పెద్దపీట వేయాలని రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని సూచించారు. బుధవారం స్థానిక ఆర్ఎం కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా డిపో మేనేజర్లు, ట్రాఫిక్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్సులను సమయపాలనకు అనుగుణంగా నడపాలన్నారు. సెక్టార్ వారీగా బస్సుల సమయపాలనను పరిశీలించారు. సర్వీసుల పనితీరుపై ఆరా తీశారు. పనితీరులో లోపాలున్న వాటిని గుర్తించి రీషెడ్యూలు చేయాలన్నారు. కార్గో సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. కేఎంపీఎల్ పెంచాలన్నారు. బ్రేక్ డౌన్ కారణంగా సంస్థకు చెడ్డపేరు వస్తోందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం రమేష్‌బాబు, డిపో మేనేజర్లు నాగభూపాల్, జీ.ఎల్ శంకర్, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.